

నిజామాబాద్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న క్రయవిక్రయదారులు

### ఇబ్బందిపడ్డ జనం..

ఎల్లారెడ్డి, జూలై 11: ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ గురువారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా చేయలేదు. సాధారణ రోజుల్లో ఇక్కడ ఎనిమిది నుంచి పది రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఉదయం నుంచి సర్వర్ డౌన్ ఉండడంతో గంటల తరబడి వేచి చూసిన క్రయవిక్రయదారులు.. నిరాశగా వెనుదిరిగారు. ప్రభుత్వానికి అధిక ఆదాయాన్నిచ్చే రిజిస్ట్రేషన్ శాఖలో ఇబ్బందులు ఏర్పడడంపై ప్రజలు అసహనం వ్యక్తంచేశారు.

### బాన్సువాడలో ఒకటే రిజిస్ట్రేషన్..

బాన్సువాడ, జూలై 11 : బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరక సాంకేతిక సమస్యతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ కోసం ఎంతో దూరం నుంచి వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరిగారు. క్రయవిక్రయాల కోసం వచ్చిన రియల్టర్లు సైతం సర్వర్ డౌన్‌తో కార్యాలయం వైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొన్నది. బాన్సువాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఒక రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# సర్వర్ డౌన్ రిజిస్ట్రేషన్లకు బ్రేక్

- యూఐడీఏఐలో సాంకేతిక సమస్య
- బోసిపోయిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- పొద్దంతా నిరీక్షించిన జనం

దోమకొండ/ఖలీల్‌వాడి, జూలై 11: సర్వర్‌లో సాంకేతిక సమస్యలు రిజిస్ట్రేషన్ వినియోగదారులకు చుక్కలు చూపించాయి. స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే క్రయవిక్రయదారులు నరకయాతన అనుభవించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్య ఏర్పడడంతో రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లావాదేవీలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సర్వర్ వచ్చినప్పటికీ రిజిస్ట్రేషన్‌కి వచ్చే వారి సమాచారం ఆధార్‌కార్డులతో సరిపోల్చుకోవడానికి ఉపయోగపడే ఈకేవైసీ పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి.

**నిరీక్షించి.. నిరాశగా వెనుదిరిగి..**

ప్రభుత్వానికి ఆదాయాన్నిచ్చే వాటిల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. ప్లాట్లు, ఇండ్లు తదితర క్రయవిక్రయాల కోసం ఈ కార్యాలయాలకు నిత్యం ఎంతో మంది వచ్చి వెళ్తారు. గురువారం ఉదయం నుంచి ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్యతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారు చాలా ఇబ్బందులు పడ్డారు. దీంతో వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ వస్తుందనే నమ్మకంతో పడిగాపులు కాసిన జనం సాయంత్రమైనా సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశగా తిరిగి వెళ్లారు.

**నిజామాబాద్‌లో సున్నా..**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా కాలేదు. దీంతో స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన వారికి నిరాశే ఎదురైంది. ఒక్కో రోజు వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు అయ్యే కార్యాలయం సర్వర్‌డౌన్ సమస్యతోబోసిపోయి కనిపించింది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు ప్రజల సమయం వృథా అయ్యింది.


బోసిపోయి కనిపిస్తున్న దోమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

### సాంకేతిక లోపంతోనే రిజిస్ట్రేషన్లు కాలేదు..



రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక లోపంతోనే రిజిస్ట్రేషన్లు జరగలేదు. సమస్య పరిష్కారం కాగానే యథావిధిగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. అర్జీదారులు ఆందోళన చెందొద్దు. ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకురావాలి. యూడీఏఐలో సాకేంతికలోపంతో సమస్య ఉత్పన్నమైనట్లు మెస్సేజ్ వచ్చింది. త్వరలోనే సమస్య పరిష్కరించుకొని రిజిస్ట్రేషన్లు జరుపుతాం.

**- రామచంద్రయ్య,**
**జిల్లా రిజిస్ట్రార్, నిజామాబాద్**

### నిలిచిన 'ధరణి' సేవలు

బోధన్, జూలై 11: బోధన్ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే సమస్య కొనసాగింది. దీంతో ఒక్క రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా జరగలేదు. సాధారణ రోజుల్లో ఇక్కడ 30 రిజిస్ట్రేషన్లు జరిగేవి. రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే కాకుండా భూముల వ్యవహారాలకు సంబంధించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఇదే సమస్య ఎదురైంది. బోధన్ తహసీల్‌తోపాటు చుట్టుపక్కల మండల రెవెన్యూ కార్యాలయాల్లో కూడా సర్వర్ డౌన్ ఫలితంగా 'ధరణి' రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఆస్తులు, భూములకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ సీడింగ్ చేస్తున్నందున ఈ ఇబ్బంది ఏర్పడిందని కొందరు అంటుండగా, రిజిస్ట్రేషన్ అధికారుల డిజిటల్ సిగ్నేచర్‌ను వారి ఆధార్ నంబర్లతో లింక్ చేస్తున్నందున ఈ సమస్య వచ్చిందని మరికొందరు భావిస్తున్నారు.



బోధన్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

### రోజంతా కలిపి మూడే రిజిస్ట్రేషన్లు..

ఆర్మూర్ టౌన్, జూలై 11: ఆర్మూర్ పట్టణంలోని జాయింట్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని సబ్ రిజిస్ట్రార్ అధికారి ఆసిఫ్ తెలిపారు. సాంకేతిక సమస్యతో గురువారం మూడు రిజిస్ట్రేషన్లు మాత్రమే చేశామన్నారు. సర్వర్ డౌన్‌తో రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారు తిరిగి వెళ్లిపోయారు. కాగా బుధవారం 35 రిజిస్ట్రేషన్లు చేసినట్లు పేర్కొన్నారు.


బోసిపోయి కనిపిస్తున్న ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

### భీమ్‌గల్‌లో రెండు రోజులుగా తిప్పలు..


భీమ్‌గల్‌లో సర్వర్ డౌన్‌తో నిర్మానుష్యంగా మారిన ఎస్‌ఆర్‌వో పరిసరాలు

భీమ్‌గల్, జూలై 11: రెండు రోజులుగా సర్వర్ డౌన్ సమస్యతో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రజలు తిరుగుతున్నారు. భీమ్‌గల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, మోర్తాడ్, సిరికొండ, ఏర్గట్ల మండలాలు ఉన్నాయి. ఈ ఆరు మండలాలకు చెందిన ఇండ్లు, ప్లాట్లు, భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు భీమ్‌గల్‌కు వస్తుంటారు. రెండు రోజుల నుంచి సర్వర్ రాకపోవడంతో ఆయా మండలాల ప్రజలు నిరాశగా వెనుదిరగాల్సిన పరిస్థితి. ఇక్కడ రోజుకు సుమారు 20 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. రెండు రోజుల నుంచి సుమారు 50వరకు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ప్రభుత్వానికి చలాన్లు కట్టి రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తాళ్ల రామడుగు గ్రామంలో కప్పతల్లి ఆట అడుతున్న గ్రామస్తులు


# వర్షాలు కురవాలని..

సిరికొండ, జూలై 11: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ సిరికొండ మండలంలోని తాళ్ల రామడుగు గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో కప్పతల్లి ఆటలు ఆడారు. గ్రామంలో పెద్దలు, చిన్నారులు రోకలికి కప్పలను కట్టి ఇంటింటికీ తిరుగుతూ నృత్యాలు చేశారు. మహిళలు హారతులు పట్టి కప్పలకు స్నానం చేయించారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కప్పతల్లి ఆట ఆడినట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు నాగుల లింబాద్రి, కుందెల్ల శ్రీనివాస్, బొక్కల దత్తాద్రి, జాకీర్ హుస్సేన్, చిన్న సాయిలు, సురేశ్, మహేందర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది రవికుమార్‌పై ఏఎస్సై దాడిని నిరసిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. అనంతరం జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. జిల్లాలోని ఇతర కోర్టుల్లో సైతం న్యాయవాదులు విధులను బహిష్కరించారు.

# బాలికపై టీచర్ లైంగిక వేధింపులు

- బయటికి రాకుండా మధ్యవర్తుల రాజీ
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- ఉపాధ్యాయుడు సహా పది మందిపై కేసు



బాన్సువాడ, జూలై 11: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు కీచకుడిగా మారాడు. విద్యార్థినిని లైంగికంగా వేధించడం ప్రారంభించాడు. మరోవైపు, ఈ విషయం బయటికి పొక్కకుండా గ్రామ పెద్దలు రాజీ కుదిర్చారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో చోటు చేసుకున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో ఉపాధ్యాయుడు సహా పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ కేసు వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. బాన్సువాడ మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు.. అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. అయితే, ఈ ఘటన బయటికి పొక్కకుండా గ్రామానికి చెందిన కొందరు మధ్యవర్తులు.. ఉపాధ్యాయుడికి, బాలిక తల్లిదండ్రులకు మధ్య రాజీ కుదిర్చారు. అయితే, తాజాగా ఈ విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో బాధితురాలితో పాటు ఆమె తల్లిదండ్రులతో మాట్లాడగా, లైంగిక వేధింపులు నిజమేనని తేలింది. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడితోపాటు రాజీకుదిర్చిన తొమ్మిది మధ్యవర్తులపైనా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పాఠశాలల్లో, పని చేసే ప్రదేశాల్లో, ఇతర చోట్ల బాలికలను, మహిళలను వేధిస్తే పోలీసులను ఆశ్రయించాలని డీఎస్పీ సూచించారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కామారెడ్డి, జూలై 11: పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నెలలుగా జీతాలు రాక గ్రామ పంచాయతీ కార్మికులు అవస్థలు పడుతున్నారని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రమేశ్, కిశోర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు దామోదర్, గోపాల్, వెంకట్, పాటిరాజాం, సైదులు, లక్ష్మణ్, బాల్‌రాజవ్వ, రాజమణి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# వే బిల్లులు 40 ట్రిప్పులు 200

- మోర్తాడ్‌లో ఆగని ఇసుక అక్రమ రవాణా
- ఉదయం 5గంటలకే వాగులోకి వాహనాలు
- పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు
- 12 గంటలపాటు ఇసుక రవాణా


ధర్మోరా వాగు నుంచి ఉదయం 6గంటలకే అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్

మోర్తాడ్, జూలై 11: మోర్తాడ్ మండలంలో పేరుకే సక్రమం అంతా అక్రమం అన్నట్లుగా కొనసాగుతుందీ ఇసుక రవాణా. సుంకెట్, ధర్మోరా గ్రామశివారుల్లోని పెద్ద వాగులో ఇసుకను తరలించేందుకు అధికారులు అనుమతినిచ్చారు. వేబిల్లులు మంజూరు చేస్తున్నారు. అయితే ఉదయం 9గంటలకు అధికారులు వచ్చిన తర్వాత ఇసుక రవాణా చేపట్టాలి. వేబిల్లులు చూపించి సంబంధిత ట్రాక్టర్‌ను తీసుకురావాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా ఇసుక రవాణా కొనసాగుతున్నది. గురువారం ధర్మోరా శివారులోని పెద్దవాగు నుంచి ఇసుక రవాణాకు 40 వేబిల్లులు ఇవ్వగా అధికారులు లేకుండానే ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి. తెల్లవారుజామున 5 నుంచి సాయంత్రం 5గంటల వరకు దాదాపు 12గంటలపాటు ఇసుక రవాణా నిర్విరామంగా సాగింది. ఇసుకను ట్రాక్టర్లలో కూలీలతో నింపించాల్సింది పోయి ఏకంగా పొక్లెయిన్ పెట్టి తోడేస్తున్నారు. ఇచ్చిన 40వేబిల్లుల ఇసుకను తరలించేందుకు రెండుమూడు గంటల సమయం సరిపోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల కనుసన్నల్లోనే ఇసుక రవాణా జరుగుతుండడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది. ఇంటిని నిర్మించే యజమానులు ఇసుక అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. ఇసుక రవాణా చేసే వారే గ్రామపంచాయతీల్లో ఇంటి యజమానుల పేరిట దరఖాస్తు చేసుకొని వేబిల్లులు పొందుతున్నట్లు సమాచారం. వేబిల్లులో ఉన్నట్లుగా కాకుండా ఇష్టం వచ్చిన చోట ఇసుకను విక్రయిస్తున్నారు. సక్రమం ముసుగులో అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలు పడితే వాగులోని ఇసుకను తరలించలేమని తెలిసి అధికార పార్టీ నాయకులు తక్కువ వే బిల్లులు ఉన్నా.. ఎక్కువ మొత్తంలో ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే భీమ్‌గల్ కప్పలవాగు, మోర్తాడ్ మొండివాగు, పాలెం పెద్దవాగు, ఏర్గట్ల మండలం బట్టాపూర్ తదితర ప్రాంతాల నుంచి పొక్లెయిన్లు పెట్టి మరి ఇసుకను తరలించిన సంఘటనలతో అధికార పార్టీ నాయకులు ఏమేరకు అక్రమ ఇసుకను తరలించారో స్పష్టమవుతున్నది. ఈ విషయం గాలిదుమారంగా మారడంతో వేబిల్లుల పేరిట ఇసుక అక్రమరవాణాకు తెరలేపినట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుకరవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ధర్మోరాలో 40 వేబిల్లులు ఇచ్చాం

ధర్మోరా వాగు నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతి ఇచ్చాం. గురువారం ఇసుకను తీసుకెళ్లడానికి 40 వేబిల్లులు ఇచ్చాం. వేబిల్లుల ప్రకారమే ఇసుకను తీసుకెళ్లాలి. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

**-సత్యనారాయణ,**
**తహసీల్దార్, మోర్తాడ్**

